# కొండపల్లి బొమ్మ

యం. యస్. మూర్తి

పదునైన జీవితపు టంచులమీద లాక్షారుణిత రేఖావృతమైన పదపల్లవయుగళిని మృదువుగా మోపి ఘణఘణ మ్రోగే గజ్జల మోతతో భావవీధుల్లో పసందుగా నాట్యమాడే ఆ తొలి వికాసపు రోజుల్లో ఎక్కడో, ఏమిటో జారవిడిచి, పోగొట్టుకుని, దాన్ని వెతుక్కుంటూన్నట్టుగా ఆ ముదత పడిన కళ్ళను బలహీనంగా మెదిలిస్తూ, ఆ పోగొట్టుకున్నదాన్ని ఎప్పుడైనా, ఎవరైనా, ఏ భావంతోనైనా తిరిగి తనకు పదిలంగా తెచ్చి యిస్తారేమో ననే ఆశతో ఎదురు తెన్నులు చూస్తూన్నట్టుగా ఎప్పుడూ అలా నిలబడి వుంటుం దామె.

ఆ దారిన పోయేవాళ్ళంతా ఆమెను గమనిస్తూ, రోజురోజూ గమనిస్తూ, సంవత్సరాల తరబడి గమనిస్తూ, ఆమెలో ఏ విధమైన కొత్త మార్పులూ కొత్త అనుభూతులూ కొత్త సంచలనాలూ కలక్కపోవడాన్ని చూసి ఆమె వూరికే అలా ఆలోచిస్తూ నిలబడుతుందే తప్ప మరేమీ ఆమెలో లేదనే తీర్మానానికి వచ్చారు.

నిజంకూడా అంతే. ఆమె వూరికే కళ్లు వప్పగించి అలా నిలబడుతుంది. ఏమీ చెయ్యదు; ఎవరితోనూ మాట్లాడదు; ఎవర్నీ ఏమీ అడగదు. 'ఏదో పోగొట్టుకున్నాను' అనే భావాన్ని కూడా ఆమె క్రమేణా మరచిపోతూ వస్తూంది. ఎవరో తిరిగి దాన్ని తెచ్చి తనకు యిస్తా రనేది అసంభవమే నని కూడా ఆమెకు తెలుసును. ఆమెకు—వాంఛ లన్నీ ఉడిగినాయ్. వాసనలు మాత్రమే కొంచం మిగిలివున్నట్టుగా ఆమె నిముష నిముషానికీ కట్టి విప్పుతూండే చీరలవల్ల తెలియవస్తుంది.

ఆభరణాలు కూడా అట్టే ధరించ దామె. నిరాభరణసుందరి — అందాల భరిణె — కోటిపల్లి తీర్థంలో ప్రదర్శింపబడ టానికి ఇప్పు డిప్పుడే అర్హత సంపాయించుకుంటూంది.

చీరలే ఆమె వ్యసనం. అన్ని ఘంటలకూ అన్ని రంగులూ మారుస్తుంది. అవి కట్టుకుని అలా నించుంటుంది పొద్దస్తమానం. ఆమె ఎక్కడికీ వెళ్ళదు. కాని, ఆమెలోంచి అనుక్షణం ఏవో—ఏవేవో—స్మృతి విస్మృతి పథాల్లో తేలియాడే వెల్లువలు—లేచి అన్ని వైపులకూ ఎగిరి పోతాయి. పోయేవాటిని ఆమె పట్టుకోలేదు—పట్టుకుని ఆపలేదు. అలాంటి ప్రయత్నాలు కొన్ని ఆవిడ చేసిన రోజు లున్నాయి. కాని చేతులు కాల్చుకుని ఊరుకుంది. ఇప్పు డెప్పుడైనా ఆ ప్రయత్నాల సంగతి ఆమె స్మృతి పథంలో మెరిస్తే ఆమె వినోలియా కంపెనీనీ, పాండ్స్ క్రీములనూ, యీవినింగ్ ఇన్ ప్యారిస్‌నూ, ఆటో దిల్ బహారునూ, తిట్టే తిట్లకు అంతుండదు.

ఒక్క చీరలే ఆమె వీక్‌నెస్—ఎప్పుడూ ఆమె అలాగే గుమ్మంలో నించుని వుంటుంది. చీరలు కట్టి విడుస్తూ. ఎప్పుడు భోం చేస్తుందో, ఎప్పుడు నిద్రపోతుందో ఎవరికీ తెలీదు.

కళ్ళు వప్పగించి మాత్రం చూస్తూంటుంది—తన చుట్టూరా వుండే పచ్చటి ప్రపంచాన్ని. అందులో తనకు కావలసిన వస్తువు లేమీ లేవని ఆమెకు తెలుసును. ఆ లేనివాటికోసం ఆమె ప్రయత్నించనూ ప్రయత్నించదు. అసలు ఆ ప్రయత్నాల మాట ఎత్తితేనే ఆమెకు వాంతి రాబోతుంది.

ఆమె యేమీ చెయ్యదు, ఎవర్నీ ఏమీ కావాలని అడగదు, ఎవర్నీ తిట్టదు. ఎవరినీ ద్వేషించదు. వూరికే అలాగ నిలబడుతుం దంతే, అలవాటుచేత.

అలా నిలబడివుండే ఒక్కొక్కప్పుడు కునికిపాట్లు పడుతూంటుంది కూడాను — ఆ కునికిపాట్లలోనే స్వప్నవీధికి ఎగబ్రాకుతుంది. ఆ ఎగబ్రాకటంలో ఆమెయొక్క వెనకటి 'తీర్థపు' రోజులు ఆమె కళ్ళముందర మెరసిపోతాయి.

మెళుకువ వచ్చాక మళ్ళీ కళ్ళు విప్పి చూసుకుంటుంది. 'ఆనాటి' సరంజాంలోది ఒక్క చీర తప్ప మరేమీ మిగలదు. అంతా అదృశ్యమైపోతుంది. మళ్ళా కళ్ళప్పగించి అలా చూస్తూవుంటుంది. తన చుట్టురా వుండే ప్రపంచాన్ని.

మీ రెప్పుడైనా చూశారో లేదో—కోటిపల్లి తీర్థం అయిపోయిన కొన్నాళ్ళవరకూకూడా ఒక్కొక్క పాక ఇంకా మిగిలి వుంటుంది. బొమ్మ లన్నిటినీ సొమ్ము చేసుకున్న ముచ్చి ఆ పాకను విప్పడం దండుగని చెప్పి దా న్నక్కడ విడిచేసి పోతాడు. వెతకడానికి ఓపికుంటే ఆ పాకలో ఏ మూలనో అతను విడిచివెళ్ళిన ఒక రంగు రాలిపోయిన బొమ్మకూడా కనబడుతుంది. ఆ బొమ్మ అలా చూస్తూ నించోడంతప్ప మ రేంచేస్తుందీ ???